తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ సురేశ్‌కుమార్

● డీపీఓ సురేశ్‌కుమార్

మఠంపల్లి, మార్చి 2 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో తాగునీటి సరఫరాపై అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. నీటి సరఫరాపై పర్యవేక్షణ ఉంచాలని, మిషన్ భగీరథలో అందుబాటులో ఉన్న వ్యవస్థను వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటార్లను వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటి పన్ను వసూలుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, ఉపాధి హామీ కూలీలకు పనుల దగ్గర ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు.

సమావేశంలో డీఎల్‌పీఓ యాదగిరి, ఎంపీడీఓ జానకిరాములు, మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి, ఎంపీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యంతోనే కరువు

● బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

కోదాడ, ఏప్రిల్ 2 : అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తుందని బీజేపీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. కోదాడలోని పెరిక హాస్టల్ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ సకాలంలో సాగర్ నుంచి నీరు విడుదల చేయకపోవడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేలాది ఎకరాలు ఎండిపోయాయని ఆరోపించారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో సాగర్ ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీలో ఉన్నప్పటికీ సాగునీరు విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలను కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి, నాయకులు వెంకటరామయ్య, శ్రీనివాస్‌రావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు వేయాలి : ఎంపీడీఓ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి, ఏప్రిల్ 2 : మండలంలోని అన్ని పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీలు వేయాలని ఎంపీడీఓ జానకిరాములు సూచించారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంఘబంధం లీడర్లకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఉన్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు రద్దు చేసి వాటి స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీలు వేయాలని నిర్ణయించిందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంఘబంధం లీడర్ల ఆధ్వర్యంలో ఉండే ఈ కమిటీలను జూన్ 10లోపు పూర్తి చేయాలని సూచించారు.

ప్రతి పాఠశాలకు నిర్వహణ కోసం రూ.25వేల నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఎంపీడీఓ ఆధీనంలో ఖర్చు చేయాలని అన్నారు. అంతకుమించితే జిల్లా కలెక్టర్ ద్వారా బిల్లులు పొందాల్సి ఉంటుందని తెలిపారు.

సమావేశంలో డీపీఓ సురేశ్‌కుమార్, డీఎల్‌పీఓ యాదగిరి, మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి, ఎంపీఓ ఆంజనేయులు, ఏపీఓ సౌజన్య, సీసీ విజయ, సీఆర్‌పీలు, ప్రధానోపాధ్యాయులు, సంఘబంధం లీడర్లు పాల్గొన్నారు.

బాలల పుస్తక దినోత్సవం

కల్లూరు పాఠశాలలో పుస్తకం చదువు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 2 : అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కల్లూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో పుస్తకం చదువు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు చదువుకోవడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని, చదువు ద్వారా సాధించలేనిది ఏదీ లేదని అన్నారు. చదువుకుంటేనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బియ్యాల వెంకటనర్సయ్య, లయన్స్ క్లబ్ సభ్యుడు జిలకర రామస్వామి, ఉపాధ్యాయులు గోపి, రామారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'కు విశేష స్పందన

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి ఆశితరెడ్డి

నూతనకల్, ఏప్రిల్ 2 : రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకొచ్చిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నది. ప్రతి మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. మంగళవారం 22 మంది మహిళల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేయగా.. అనుమానం ఉన్న 13 మంది శాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని టీహబ్‌కు పంపించినట్లు మండల వైద్యాధికారి ఆశితరెడ్డి తెలిపారు. వైద్య సిబ్బంది తారమ్మ, వెంకట్‌రెడ్డి, ఆనంద్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

గరిడేపల్లి, ఏప్రిల్ 2 : మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త షేక్ జాను గుండెపోటుతో, కొత్తగూడెం గ్రామానికి చెందిన నకిరేకంటి కోటయ్య ఆకస్మికంగా మంగళవారం మృతి చెందారు. వారి మృతదేహాలపై బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం కొత్తగూడెంలో కోటయ్య కుటుంబ సభ్యులకు కేతవారిగూడెం మాజీ సర్పంచ్ కీత జ్యోతీరామారావు రూ.8వేల ఆర్థిక సాయం అందించారు.

కార్యక్రమాల్లో సర్వారం పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంబిరెడ్డి, ఎంపీటీసీలు మేకల స్రవంతి శోభన్‌బాబు, కడప ఇసాక్, మాజీ సర్పంచ్ ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● అన్ని వైద్యశాలల్లో మందులు, వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి : కలెక్టర్ వెంకట్రావ్

ఆత్మకూర్.ఎస్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 2 : జిల్లాలో ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నందున వడదెబ్బ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ వైద్యాధికారులను ఆదేశించారు. ఆత్మకూర్.ఎస్ పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల ప్రజలకు వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. వృద్ధులు, పిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. పీహెచ్‌సీలో ఓపీ పెరుగాలని, మందుల కొరత లేకుండా చూడాలని, వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కొటాచలంతో కలిసి పాల్గొన్నారు. మండల స్టోర్, ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి మౌనిక, వైద్య సిబ్బంది ఉన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

సూర్యాపేట : జిల్లాలోని ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ కేంద్రాలను పరిశీలించడానికి, వాస్తవ పరిస్థితులు జిల్లా ఎన్నికల అధికారికి తెలిపేందుకు ముగ్గురు జిల్లా స్థాయి అధికారులతో కూడిన టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి నివేదికలను అదనపు కలెక్టర్, ఆర్డీఓ, డీఎస్పీలకు అందజేయాలని సూచించారు. అధికారులు ఎవరైనా హాజరు కాపోయినా, సరైన రితిలో తనిఖీలు చేపట్టకపోయినా ఎన్నికల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శిక్షణకు హాజరుకాని వారిపై చర్యలు

నియోజకవర్గాల వారీగా పీఓ, ఏపీఓలకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావ్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 2,832 మందికి గాను 113 మంది హాజరు కాలేదన్నారు. ఇందులో సూర్యాపేట నియోజవర్గంలో 65, కోదాడలో 15, హుజూర్‌నగర్‌లో 23, తుంగతుర్తి నుంచి 10 మంది ఉన్నారని తెలిపారు. బుధవారం మరో అవకాశం ఉన్నదని, దీనికి సైతం హాజరుకాని వారిపై ఆర్‌పీ యాక్ట్ ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

వడదెబ్బపై అవగాహన

తిరుమలగిరి, ఏప్రిల్ 2 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు పీహెచ్‌సీ డాక్టర్ వందన మంగళవారం వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్ డిపో హోల్డర్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తర్వాతే పనికి వెళ్లాలని సూచించారు. తెల్లని కాటన్ దుస్తులు ధరించడం మంచిదన్నారు. వడ దెబ్బకు గురైతే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్లు స్వరూపకుమారి, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలి

చిలుకూరు, ఏప్రిల్ 2 : వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని మండల ప్రత్యేకాధికారి రూపేందర్‌సింగ్, ఎంపీడీఓ గిరిబాబు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ వర్కర్లకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వడదెబ్బకు అవగాహన కల్పించడంతోపాటు జాగ్రత్తలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నవ్య, సుశీల, సీహెచ్ఓ వినోద్, ఏఎన్ఎంలు ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా పని చేయాలి

● ఎస్పీ రాహుల్ హెగ్డే

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 2 : జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రణాళిక ప్రకారం సమన్వయంతో పని చేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించి పోలీసు బందోబస్తు, యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో డబ్బు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణా జరుగవద్దన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేలా నగదు, బహుమతులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్త్రాలు, ఆభరణాల వంటి వాటిని అడ్డుకోవాలని సూచించారు. వాహనాల తనిఖీ పటిష్టంగా చేయాలని, అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టు నిర్వహణతోపాటు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సిబ్బంది ఎన్నికల డ్యూటీపై పూర్తి అవగాహన కలిగి ఉండి ఒత్తిడి లేకుండా పని చేయాలన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు, ఓటర్లు భాగస్వామ్యం కావాలని ఎస్పీ కోరారు. ఇతర శాఖలతో కలిసి కోదాడ రూరల్ పీఎస్ పరిధి రామాపురం ఎక్స్ రోడ్డు వద్ద, మఠంపల్లి పీఎస్ పరిధి మట్టపల్లి బ్రిడ్జి వద్ద, చింతలపాలెం పరిధిలో 4చెక్ పోస్టులు దొండపాడు, పులిచింతల ప్రాజెక్టు, చింత్రియాల, బుట్టమాదారం వద్ద అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు నిర్వహిస్తున్నామన్నారు. వీటికి అనుబంధంగా సూర్యాపేట రూరల్ పీఎస్ ఎస్ హెచ్ 65పై టేకుమట్ల వద్ద, భీమారం వద్ద, తిరుమలగిరి పీఎస్ పరిధి పాత తిరుమలగిరి వద్ద, వెలిశాల వద్ద, మోతె పీఎస్ పరిధి మామిళ్లగూడెం వద్ద, అనంతగిరి పీఎస్ పరిధి శాంతినగర్, నేరేడుచర్ల మండలంలో చిల్లేపల్లి, మద్దిరాల పీఎస్ పరిధిలో కుంటపల్లి వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకు కోటీ 18లక్షల నగదు, రూ.5,25,000 విలువైన 890లీటర్ల మద్యం, కోటీ 10లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.70,30,000 విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, దుస్తులు, ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో రూ.33 లక్షల విలువైన మద్యం సీజ్ చేశామన్నారు. సమావేశంలో అడ్మిన్ ఎస్పీ నాగేశ్వర్‌రావు, అర్మ్డ్ అదనపు ఎస్పీ జనార్దన్, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేశ్ మీనా, డీఎస్పీలు రవి, శ్రీధర్‌రెడ్డి, మట్టయ్య, శ్రీనివాస్‌రావు, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, ఎన్నికల సెల్ ఇన్‌స్పెక్టర్ పాండరి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, కమ్యూనికేషన్, డీసీఆర్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐకేపీ సెంటర్‌లో డీఆర్డీఓ తనిఖీ

ఐకేపీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఆర్డీఓ మధుసూదన్‌రాజు

పెన్‌పహాడ్, ఏప్రిల్ 2 : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీఓ జి.మధుసూదన్‌రాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేయాలని, అవకతవకలు జరుగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏపీఎం అజయ్, సీసీ చెన్నయ్య, వీఓఏ విజయ, నీరజ, ఇందిరమ్మ, సుమతి పాల్గొన్నారు.

పాలకవీడులో కేంద్ర బలగాల కవాతు

పోలీసుల కవాతులో పాల్గొన్న ఎస్ఐ లక్ష్మీనారాయణ, కేంద్ర బలగాలు

పాలకవీడు, ఏప్రిల్ 2 : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో మంగళవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు శాంతి భద్రతలపై అవగాహన కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలన్నారు.

మొక్కలు ఎండకుండా చూడాలి : ఎంపీడీఓ సునీత

నూతనకల్, ఏప్రిల్ 2 : వేసవిలో మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీరు పెట్టాలని ఎంపీడీఓ సునీత అన్నారు. మండలంలోని వెంకేపల్లి, కొత్తతండా, పెద్దనెమిల గ్రామాల్లో మంగళవారం వన నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ సంరంక్షించాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల్లో మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళలో నీరు పెట్టాలని సూచించారు. ఆమె వెంట ఏపీఓ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక ప్రాజెక్టు నిర్వహించాలి

● సీఎం రేవంత్‌రెడ్డికి సామాజిక కార్యకర్త గోపి లేఖ

నడిగూడెం, ఏప్రిల్ 2 : రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక పైలెట్ ప్రాజెక్టు నిర్వహించాలని వ్యవసాయ సామాజిక కార్యకర్త మొలుగూరి గోపి కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగంతో భూసారం తగ్గిపోతున్నదని, ఆ పంటలను తినడం వల్ల రకరకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని అన్నారు. రూ.100 కోట్లతో ప్రకృతి వ్యవసాయంపై పైలెట్ ప్రాజెక్టు ఎలా నిర్వహించాలో రూపొందించిన నివేదికను లేఖలో వివరించినట్లు తెలిపారు.

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

● తుంగతుర్తి ఎంపీపీ కవిత



తుంగతుర్తి : పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కవిత, గౌడ సంఘం నాయకులు

తుంగతుర్తి, ఏప్రిల్ 2 : బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ గుండగాని కవితా రాములుగౌడ్ అన్నారు. పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సామాన్య గీత కార్మిక కుటుంబంలో పుట్టి మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి బహుజన రాజ్యాన్ని స్థాపించిన యోధుడు పాపన్నగౌడ్ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య, సంఘం నాయకులు గోపగాని రమేశ్‌గౌడ్, ఉప్పలయ్య, వెంకన్న, వెంకటనారాయణ, శ్రీనివాస్, వెంకన్న, సుధాకర్, వీరయ్య, నరేశ్, లతీఫ్‌గౌడ్ పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం

మేళ్లచెర్వు : పాపన్న గౌడ్ జీవితం బడుగులకు స్ఫూర్తిదాయకమని కౌండిన్య గౌడ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. వెల్లటూరులో పాపన్న విగ్రహానికి నివాళులర్పించారు. ఆంజనేయులు, పుల్లయ్య, కొండలు, శ్రీనివాస్, నాగరాజు, సైదులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : తొగర్రాయి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. వెంకటేశ్వర్‌రావు, ఏడుకొండలు, రామారావు, వేలాద్రి, పుల్లయ్య, ధనమూర్తి, వెంకయ్య, నరసింహారావు, అంజయ్య, వెంకన్న పాల్గొన్నారు.

నాగారం : మామిడిపల్లిలో పాపన్నగౌడ్ చిత్రపటానికి గౌడ విద్యార్థి సంఘం, గౌడ సంక్షేమ సంఘం నాయకులు నివాళులర్పించారు. గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు వెంకన్న, లింగస్వామి, కృష్ణ, యాదగిరి, రామకృష్ణ, రాకేశ్, మహేశ్, సోమలింగం పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ, ఏప్రిల్ 2 : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కోదాడలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొని మాట్లాడారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ముస్లింల అభివృద్ధికి తాను కృషి చేశానన్నారు. ప్రతి ఎన్నికల్లో ముస్లింలు తన వెన్నంటి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు వేనేపల్లి చందర్‌రావు, వెంకటరత్నంబాబు, వంగవీటి రామారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, చింతలపాటి శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీలారమేశ్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ ప్రియాంక

ఎన్నికల అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

కోదాడ రూరల్, ఏప్రిల్ 2 : అధికారులు ఎన్నికల విధులు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. పట్టణంలోని సనా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణను ఆమె పరిశీలించి మాట్లాడారు. శిక్షణలో అందించిన సూచనలు, నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సీహెచ్ సూర్యనారాయణ, తాసీల్దార్ సాయిగౌడ, ఎంఈఓ సలీంషరీఫ్, ఎలక్షన్ డిప్యూటీ తాసీల్దార్ అనిల్ సంధ్యారాణి, ఆర్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వర్ధమానుకోటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈఓ మహిత

నాగారం, ఏప్రిల్ 2 : మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో కిసాన్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈఓ మహిత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జలగం అంబేద్కర్, కిసాన్ ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గంట మహేందర్, డైరెక్టర్లు మహేశ్, సోమయ్య, శేఖర్‌రెడ్డి, రమేశ్, వెంకన్న, యాదగిరి, శ్రీను, లింగయ్య, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

● బీఆర్ఎస్ పార్టీ పెన్‌పహాడ్ మండలాధ్యక్షుడు యుగంధర్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు యుగంధర్

పెన్‌పహాడ్, ఏప్రిల్ 2 : ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు దొంగరి యుగంధర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించడంతో కాళేశ్వరం నీళ్లను 24గంటలు వదిలి మళ్లీ ఆపివేశారన్నారు. ఎండిపోయిన వరి పంటకు ఎకరానికి రూ.25వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు పొదిళ్ల నాగార్జున, మురళి, జానకిరాములు, రాధాకృష్ణ, రెహ్మాన్, రాజేశ్ పాల్గొన్నారు.

రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్

● బీఆర్ఎస్ సూర్యాపేట మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 2 : మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని నిలువునా మోసం చేసిందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇమాంపేట గ్రామంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవగాహన లోపంతో వచ్చిన కరువుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ కాళేశ్వరం ప్రాజెక్టును అభాసుపాలు చేసేందుకు కాంగ్రెస